
ప్రజాశక్తి

సోమవారం 25 సెప్టెంబర్ 2023

5

శ్రీ సత్యసాయి





సంస్మరణ సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు

పర్యావ[హా]రణం..!

భవిష్యత్తు తరాల బాగుకోసం పర్యావరణ పరిక్షణకు స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ ప్రేమికులు అనేక కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం లాంటి కార్యక్రమాలను అనేకం చేస్తుంటారు. ప్రజల్లోనూ దీనిపై చైతన్యం తెచ్చి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతుంటారు. పర్యావరణం బాగునకు వీరు ఇంతలా కష్టపడుతుంటే కొందరు రియల్టర్లు, పారిశ్రామిక వేత్తలు మాత్రం వారి స్వార్థం కోసం యథేచ్ఛగా మొక్కలను నరికేస్తున్నారు. పచ్చని చెట్లను నరికి దాని కలపను పరిశ్రమలకు తరలించి కాల్చిబూడిద చేస్తున్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలోని హిందూపురం తూముకుంట పారిశ్రామిక వాడలో నిత్యం ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. వీటిని నియంత్రించాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.



గోళాపురం పారిశ్రామిక వాడలోని వీర్‌గో పరిశ్రమలో కాల్చడానికి సిద్ధంగా ఉంచిన కలప

- యథేచ్ఛగా వృక్షాల నరికివేత
- పరిశ్రమల్లో కాలుతున్న కలప
- పారిశ్రామికవేత్తల దోపిడీ
- చోద్యం చూస్తున్న అటవీశాఖ
- మామూళ్ల మత్తులో నిబంధనలకు తూట్లు
- అటవీ శాఖకు నెలకు రూ.25 లక్షల ముడుపులు..?

ప్రజాశక్తి-హిందూపురం

ఉమ్మడి అనంతపురం జిల్లాలో హిందూపురం పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన, చెందుతున్న ప్రాంతంగా గుర్తింపు ఉంది. హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామికవాడల్లో దాదాపు 120 వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ఫార్మా పరిశ్రమలతో పాటు ఉడ్ తయారు చేసే వీర్‌గో పరిశ్రమ, లేపాక్షిలోని సెర్‌డెనీం ప్యాంట్ల పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమకు అవసరమయ్యే చెట్లను ఈ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా నరికేస్తున్నాయి. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన అటవీశాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి వారికి సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చెట్లను నరికి కలపను తరలించే విషయంలో అటవీశాఖ, కాలుష్యనియంత్రణ మండలి, వాణిజ్య పన్నులశాఖలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. అటవీశాఖకు పరిశ్రమలతో పాటు శామిల్స్ వారి నుంచి నెలకు సుమారు రూ.25లక్షల వరకు మామూళ్లు అందుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. స్టీల్‌ప్లాంట్లో రోజూ టన్నులకొద్దీ కలప కాలుతోంది. అటవీశాఖాధికారుల దయతో అంతభారీ ఎత్తున కలపవారికి లభిస్తోంది. రోజురోజుకూ పారిశ్రామిక వాడ, సమీప ప్రాంతాల్లో చెట్లు తరిగి పోతుండడంతో పర్యావరణ సమతుల్యతకు విఘాతం ఏర్పడుతోంది. పరిసర గ్రామాల పరిధిలో భూగర్భజలాలు సైతం విషరసాయనాలతో నిండి భూమిమొత్తం నల్లగా మారిపోతోంది. రైతులు సాగుచేస్తున్న పంటలు సైతం కాలుష్యం దెబ్బకు బీడుగా మారిపోతున్నాయి. హిందూపురం సమీప ప్రాంతాల్లో ఇటుకల బట్టీ వ్యాపారం కూడా ఎక్కువగానే జరుగుతోంది. ఇటుకలను కాల్చడానికి ఇష్టారాజ్యాంగా పకృతి వనరులైన పచ్చని చెట్లను అడ్డంగా నరికేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే పచ్చని మొక్కలన్నీ కూడా కాలిబూడిదయ్యే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చెట్లను నరికి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

పర్యావరణం నాశనం...

అభివృద్ధి పేరుతో పారిశ్రామిక వాడల్లో స్థాపించిన పరిశ్రమల వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. చెట్లను నరకడం, వాటి కలపను నిత్యం మండిస్తుండడంతో పర్యావరణం నాశనమై, కాలుష్యం పెరుగుతోంది. పగలూరాత్రీ అన్న తేడా లేకుండా అక్కడ బాయిలర్లు కాలుతునే ఉంటాయి. బాయిలర్లలో వేడిని నింపేందుకు పచ్చని చెట్లను నరికి వాటి కలపను మండిస్తున్నారు. ఇక్కడ నిత్యం కాలిపోతున్న కలప భవిష్యత్తుకు ప్రమాద ఘంటికలను మోగిస్తోంది. ఈ పరిశ్రమల చుట్టుపక్కల గ్రామాల వారు ఓ వైపు దుమ్మూధూళి, మరోవైపు కాలుష్యంతో సతమతం మవుతున్నారు. పారిశ్రామికవేత్తలు ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను అనుభవిస్తూ కోట్లాది రూపాయలను సంపాదించుకుంటున్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేసిన వారంతా బీహార్, రాజస్థాన్, గుజరాత్ తదితర రాష్ట్రాలకే చెందినవారే ఉండడం గమనార్హం. పరిశ్రమల్లో పని చేసే ఉద్యోగులు, కూలీలు కూడా ఇతర రాష్ట్రాల వారే ఉన్నారు. స్థానికుల ఉపాధి కల్పిస్తామన్న హామీ ఇక్కడ మచ్చుకైనా కన్పించదు. ఇక్కడ జరుగుతున్న అనర్థాలను ప్రశ్నించేందుకు వెళ్లే వారిపై దాడులు చేయించేందుకు కూడా పరిశ్రమ యాజమాన్యాలు వెనుకాడడం లేదు. పరిశ్రమలోకి కొత్తవారిని ఎవరినీ రానివ్వకుండా గేటుబయటనే అడ్డుకునేందుకు ప్రత్యేకమైన వ్యక్తులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీనిని నియంత్రించాల్సిన అధికారులు, ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా వారికి వంతపాడుతుండడంతో వారు మరింత రెచ్చిపోతున్నారు. దీంతో పర్యావరణం దెబ్బతిని కాలుష్యం ప్రజలపై దాడి చేసే ప్రమాదం పొంచి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చెట్లను అక్రమంగా నరికేసి కలపను తరలించుకుపోతున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ట్రాక్టర్ ద్వారా పరిశ్రమకు తరలిపోతున్న కలప

చెట్లను రక్షించుకుంటేనే భవిష్యత్తు

అడవులతో పాటు చుట్టుపక్కల ఉన్న చెట్లు అంతరిస్తే పర్యావరణానికి విఘాతం ఏర్పడుతుంది. దీని వల్ల భవిష్యత్తు తరాలకు తీరని నష్టం ఏర్పడుతుంది. అటవీ సంరక్షణ చట్టాలను అమలు చేయాల్సిన అధికారులు కొంతమంది అవినీతికి పాల్పడి చట్టాలను నీరుగార్చేస్తున్నారు. పరిశ్రమల కోసం నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఒక చెట్టువిలువ రూ.70 లక్షలుగా సుప్రీంకోర్టు నిర్ణయించదంటే చెట్టు గొప్పదనం ఏమిటో అర్థం అవుతోంది. అలాంటి చెట్లను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అలాంటి చెట్లను ప్రతి రోజూ వేల సంఖ్యలో నరికేస్తుంటే దానిని అడ్డుకోవాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

భాస్కర్‌రెడ్డి, పర్యావరణ పరిరక్షకులు.

నేతన్న సమస్యలపై 'పోలా' ది అలుపెరగని పోరాటం

కార్మిక సరంక్షణకు తపించిన నేత
ఆయన మరణం చేనేతకార్మిక లోకానికి తీరని లోటు
సంస్మరణ సభలో నాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

కామ్రేడ్ పోలా రామాంజనేయులు చేనేత కార్మికుల, ప్రజా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఆదివారం శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణంలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సిపిఎం రాష్ట్ర నాయకులు ఓబులు, రాంభూపాల్, ఎపి చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలక్రిష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు పోలా రామాంజనేయులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పోలా రామాంజనేయులు చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి చేసిన పోరాటాలను వివరించారు. చేనేత కార్మికుల సమస్యలపై పోరాడుతూ జైలుకు కూడా వెళ్లారన్నారు. పోలా రామాంజనేయులు మృతి చేనేత కార్మిక లోకానికి తీరని లోటని అన్నారు. చేనేత రంగం అంటేనే గుర్తుకు వచ్చే నాయకుడిగా పోలా రామాంజనేయులు కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాల చేశారన్నారు. ఆయన ఉద్యమ స్ఫూర్తిని, ఆశయాలను కొనసాగిద్దామన్నారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జింకాచలపతి, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్, సిపిఎం జిల్లాకమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న, పట్టణ కార్యదర్శి నామాలనాగార్జున, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్. బాషా, అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, రైతుసంఘ జిల్లానాయకులు జెవి. రమణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పోలారామాంజనేయులు చిత్రపటానికి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు.

అంగన్వాడీల నిర్బంధం దుర్మార్గం

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అంగన్వాడీలు తలపెట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకోవడం సరైంది కాదని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం విజయవాడలో అంగన్వాడీల సంఘాలు తలపెట్టిన రాష్ట్ర ధర్నాకు అనుమతులు నిరాకరించామం టూ ప్రభుత్వం ప్రకటించడం అన్యాయం అన్నారు. ముందుగానే అంగన్వాడీ సంఘాలు అనుమతులు తీసుకున్నప్పటికీ చివరి నిమిషంలో పోలీసు వర్గాలు అనుమతులు లేవని ఎక్కడికక్కడ నిర్బంధించడం సరైన చర్య కాదన్నారు. శాంతియుతంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజాస్వామ్యతంగా సోమవారం విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద ఆందోళన చేయడానికి నిర్ణయించారన్నారు. అయితే పోలీసులు ఉద్యమం అణచడానికి ఎక్కడికక్కడ అంగన్వాడీలను నిర్బంధించడం అన్యాయం అన్నారు. జరిగే పరిణామాలకు ప్రభుత్వానిదే బాధ్యత అని హెచ్చరించారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో అంగన్వాడీలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించిన మహిళలను వెంటనే స్వచ్ఛందంగా విడిచి పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదన్నారు. అంగన్వాడీ లు చేపట్టిన ఆందోళనకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తోందన్నారు. ఇకనైనా ప్రభుత్వం అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

జిల్లాలో మోస్తరు వర్షం

పొంగిపొర్లుతున్న చెక్ డ్యాములు
పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు



పరవళ్లు తొక్కుతున్న చిత్రావతి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్, పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి జిల్లాలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం కారణంగా నియోజకవర్గంలోని పలు చెక్ డ్యాములు, వంకలు, వాగుల్లో జలకళ సంతరించుకుంది. పుట్టపర్తి పట్టణ సమీపంలోని చిత్రావతి నది పొంగి పొర్లుతోంది. శుక్ర శనివారాల్లో ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు చిత్రావతి నది పరవళ్లు తొక్కుతోంది. పుట్టపర్తి సమీపానగల రాయలవారిపల్లి గ్రామానికి తాత్కాలికంగా చిత్రావతి నదిపై ఏర్పాటు చేసిన వంతెన నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. ముదిగుబ్బ మండలం మలక వేముల సమీపంలో పట్నం సరిహద్దు ప్రాంతంలో మద్దిలేరు ఉధృతంగా ప్రవహిస్తున్న కారణంగా ఉదయం పూట పలు గ్రామాలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు 36 గ్రామాల ప్రజలు రాకపోకలకు సమస్యలు ఎదుర్కోవాల్సి వచ్చింది. అదేవిధంగా పలు ప్రాంతాలలో పంటలు కూడా నీట మునిగాయి. గోరంట్ల, పుట్టపర్తి, కొత్తచెరువు బుక్కపట్నం మండలాల్లో పలు వరి మడులు మీదుగా వర్షం నీరు వెళ్లాయి. దీంతో కొంతవరకు వరి మడులు కూడా దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు. ప్రధానంగా చిత్రావతి నది ఎగువ ప్రాంతంలో విస్తారంగా వర్షాలు కురియడంతో శుక్ర, శని వారాలలో నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పుట్టపర్తి పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన సాయి నగర్, వివేకనంద రోడ్డు జలమయమయ్యాయి. కోవెలగుట్టపల్లి సాహెబ్ చెరువు మరువ పోవడం వల్ల చెరువు కింద సాగులో ఉన్న వరి మడి నాట్లు సుమారు 10 ఎకరాల వరకు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలను రెవెన్యూ అధికారులు పరిశీలించి పంట నష్టం అందించడానికి తగు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. ప్రధానంగా రెండు రోజులపాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు విద్యుత్ కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో నది పరివాహక ప్రాంతంలోని గ్రామాలలో చీకట్లు అలుముకున్నాయి. విద్యుత్ అంతరాయం వల్ల రెండు రోజులపాటు వృద్ధులు, చిన్నపిల్లలు ఉక్కపోతతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రశాంతి గ్రామ్, పెద్ద కమ్మవారిపల్లి, బీడుపల్లి, తదితర గ్రామాలలో ఆదివారం సాయంత్రం దాకా విద్యుత్ అధికారులు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించ లేక పోయారు.

జిల్లాలో కురిసిన వర్షపాతం వివరాలు మండలాల వారీగా...

అత్యధికంగా కదిరి నియోజకవర్గం నంబుల పూలకుంట మండల పరిధిలో 76.2 మిల్లీ మీటర్లు, అత్యల్పంగా మడకశిర నియోజకవర్గం లోని గుడిబండలో 6.6 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయింది. ఇక తలుపుల మండలంలో 72.4 మిల్లీమీటర్లు, పుట్టపర్తిలో 69.5 మిల్లీమీటర్లు, కదిరిలో 68 మిల్లీమీటర్లు, నల్లమాడలో 67.2, బుక్కపట్నంలో 56. 4, నల్ల చెరువులో 50.6, గాండ్లపెంటలో 48.2, పెనుకొండలో 45.4, కొత్త చెరువులో 44.2, ముదిగుబ్బలో 40.2 లేపాక్షిలో 38.6, అమడుగూరులో 37.4, తనకల్లులో 36.4, హిందూపురంలో 28.6, గోరంట్లలో 22.4 , చిలమత్తూరులో 22.4, ఓబుల దేవర చెరువు లో 17.2, మడకశిరలో 11 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. జిల్లాలో మొత్తం 32 మండలాలుండగా 27 మండలాలలో వర్షం కురిసింది.

కొత్తచెరువు రూరల్: కొత్తచెరువు మండలంలో 44. 2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయినట్లు తహశీల్దార్ రామాంజనేయరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వంగపేరు జలకళ సంతరించుకుంది. మండలంలోని వాగులు వంకలు నీటితో నిండాయి. మండలంలో వర్షాలు భారీగా కురిసే అవకాశం ఉందని ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ సూచించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో శనివారం నాటి నుంచి అక్కడక్కడ వర్షపాతం నమోదవుతోంది. సత్యసాయి జిల్లాలో చాలా మండలాల్లో ఒక మోస్తరు వానలు పడ్డాయి. అనంతపురం జిల్లాలో నాలుగైదు మండలాల్లో వర్ష ప్రభావముంది. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి ఉమ్మడి జిల్లాలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. దీంతో ఖరీఫ్ పంటల సాగు కూడా 50 శాతానికే పరిమితమైంది. అయితే సెప్టెంబరు తొలి వారంలో పడినప్పటికీ మధ్యలో రెండు వారాలు వానల్లేకుండా ఉన్నాయి. తిరిగి ఇప్పుడు చివరి వారంలో వర్షాలు పడుతుండటం కొంత ఊరటనిచ్చేదిగా ఉంది.

అనంతలో అత్తేసరే

అపంతపురం జిల్లాలో రెండు రోజులు పడిన వర్షపాతం అంతంత మాత్రంగానే ఉంది. పామిడిలో అత్యధికంగా 61 మిల్లిమీటర్లు నమోదయింది. ఆ తరువాత పెద్దవడుగూరులో 37 మిల్లిమీటర్లు పడింది. తాడిపత్రిలో 34.2 మిల్లిమీటర్లు, పుట్లూరులో 26 మిల్లిమీటర్లు పడింది. తక్కిన చోట్ల నామ మాత్రంగానే వర్షపాతం పడింది.జిల్లా మొత్తంగా చూస్తే 284.5 మిల్లిమీటర్లు పడాల్సి ఉండగా 205.1 మిల్లిమీటర్లు మాత్రమే నమోదయింది. 28 శాతం వర్షపాతం లోటుంది. ఇటువంటి పరిస్థితి అనంతపురం జిల్లాలో 1991 తరువాత ఇదేనని వాతావరణ శాస్త్రవేత్త అశోక్‌కుమార్ తెలిపారు.

గతేడాది కంటే తక్కువే

గతేడాది ఇదే సమయానికి అంటే జూన్ నుంచి సెప్టెంబరు నెల ఇప్పటి వరకు 33 రోజులు వర్షం పడిన రోజులున్నాయి. ఈసారి ఇప్పటి వరకు 26 రోజులే వర్షం పడిన రోజులున్నాయి.పడిన వర్షం కూడా అంతంటా లేదు. అది కూడా నామ మాత్రంగానే ఉంది. రాయదుర్గం, బొమ్మనహళ్ మండలాల్లో సెప్టెంబరు మాసంలోనూ వర్షపాతం చాలా తక్కువగా నమోదయింది. రాయదుర్గంలో ఈ నెలంతా కలిపి పడిన వర్షపాతం కేవలం 9 మిల్లిమీటర్లు, బొమ్మనహల్‌లో 13 మిల్లిమీటర్లు మాత్రమే పడింది. ఇలా అనేక వ్యత్యాసాలతో పంటలపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది.

మారనున్న వసతిగృహాల రూపురేఖలు

సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివరంగ ప్రసాద్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలోని26 సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలు త్వరలో మారున్నాయని సాంఘిక సంక్షేమ శాఖ పీడీ శివ రంగ ప్రసాద్ పేర్కొన్నారు.. ఆదివారం ఆయన ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెలుబుచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో నాడు నేడు కింద ఏ విధంగా అభివృద్ధి చేశారో అదేవిధంగా సాంఘిక సంక్షేమ హాస్టళ్ల రూపురేఖలను ఏడాదిలోపు మార్చనుందని చెప్పారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడంతోపాటు ఇంటర్నెట్, కలర్ టీవీ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులతో చర్చించి నిర్ణయాలు తీసుకుని ఉన్నట్లు వెల్లడించారు.

ప్రశ్న : శ్రీ సత్య సాయి జిల్లాలో ఎన్ని హాస్టల్లో ఉన్నాయి ? వాటిలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఎన్ని ?


జవాబు: శ్రీ సత్య సాయి జిల్లాలో 26 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. వాటిలో మూడు నుండి పదవ తరగతి విద్యార్థుల కోసం ఏర్పాటుచేసిన హాస్టళ్లు బాలురకు 12, బాలికలకు 5 ఉన్నాయి. ఇంటర్మీడియట్ చదివే బాలికలకు ఐదు, బాలురకు నాలుగు పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి.

ప్ర : విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు సరిగా అందలేదన్న విమర్శలపై మీ అభిప్రాయం ?

జ: గతంలో మాదిరిగా కాకుండా విద్యార్థులకు నెలనెలా ఇవ్వాల్సిన కాస్మోటిక్ ఛార్జీలను మార్చి 2022 నుండి వారి తల్లుల ఖాతాల్లో జమ చేస్తున్నాం. మెస్ ఛార్జీల విషయానికి వస్తే 2018 నుండి ఇస్తున్న చార్జీలే గతం వరకు అమల్లో ఉండేవి. ఇటీవల మెస్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు మెనూ ప్రకారం సరైన భోజనం అందిస్తున్నాం.

ప్ర : హాస్టళ్లలో సిబ్బందికి బయోమెట్రిక్ విధానం అమలులో ఉందా?

జ : హాస్టల్లో సిబ్బందికి బయోమెట్రిక్ విధానాన్ని అవలంభిస్తున్నాం. దాని ద్వారా ఏ అధికారి విధులకు హాజరు కాకుండా ఉండేందుకు వీలులేదు.



బయోమెట్రిక్ వేస్తే ఉన్నతాధికారులు దృష్టికి వెళుతుంది ఈ తరుణంలో సిబ్బంది హాజరుపై సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో హాజరు శాతం పూర్తిస్థాయిలో ఉంది.

ప్ర : అవుట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు నెలనెలా మంజూరు చేస్తున్నారా ?

జ: సాంఘిక సంక్షేమ హాస్టళ్ల పరిధిలో రెండు రకాల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఒకటి, మూడు నుండి పదవ తరగతి వరకు ఉన్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఆప్‌కార్డ్ నుండి నెలనెలా వేతనాలు అందుతున్నాయి. జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న సిబ్బందికి నెలనెలా వేతనాలు అందడం లేదు. వారికి మదర్‌థెరిస్సా ట్రస్ట్ నుండి వేతనాలు అందాల్సుంది. ప్రభుత్వం గ్రాంట్ విడుదల చేస్తే మదర్‌థెరిస్సా ట్రస్టుకు బదలాయింపు చేసి వారికి వేతనాలు మంజూరు చేస్తారు. దీంతో వేతనాల చెల్లింపులో జాప్యం జరుగుతోంది.



సాంఘికసంక్షేమ శాఖ పీడీ శివరంగప్రసాద్

ప్ర : హాస్టళ్ల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలేవి?

జ : హాస్టళ్ల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపడుతోంది. అద్దె భవనాల్లో ఉన్న వసతిగృహాలపై దృష్టి సారించింది..నాడు నేడు కింద శాశ్వత భవనాలు నిర్మించి ప్రస్తుతం ఉన్న హాస్టళ్లను ఉత్తమ స్థాయిలో తీర్చిదిద్దాలన్న దృక్పథంతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సౌకర్యవంతంగా హాస్టళ్లను ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తోంది.

'పురం'లో కోలాహలంగా వినాయక నిమజ్జనం

ఆలస్యంగా ప్రారంభమైన శోభాయాత్ర



వినాయకుడి విగ్రహం ఊరేగింపు

హిందూపురం : హిందూపురంలో వినాయక నిమజ్జన కార్యక్రమం ఆదివారం కోలాహలంగా జరిగింది. ప్రతి సంవత్సరం సాయంత్రం పాటికి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమలు శోభాయాత్రలో ఉండేవి. అయితే పోలీసుల అవగాహన రాహిత్యంతో సాయంత్రం 6 గంటలు అయిన ఆయా ప్రాంతాల నుంచి ప్రతిమలు శోభాయాత్రకు రాలేదు. చివరకు పోలీసులు వినాయక మంటప నిర్వహకులతో చర్చించి నిమజ్జనానికి ఆలస్యం అవుతుందని ప్రతిమలను తరలించాలని కోరారు. దీంతో నిర్వహకులు అన్ని సిద్ధం చేసుకుని శోభాయాత్రకు వచ్చే సమయానికి రాత్రి అయింది. ఆదివారం రాత్రి పట్టణమంతా భక్త జన సంద్రమైంది. ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లలో విగ్రహాలను ఉంచి శోభాయాత్ర నిర్వహించి గుడ్డం కోనేరులో నిమజ్జనం చేశారు. మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఇన్‌ఛార్జి ఎంఇ వెంకట రమణ, డిఇఇ బాలసుబ్రమణ్యం, ఎఇలు తదితరులు ప్రత్యేక క్రేన్ లను ఏర్పాటు చేసి నిమజ్జన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కోనేరు వద్ద వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వేణు రెడ్డి, చైర్ పర్సన్ ఇంద్రజతో పాటు వైస్‌చైర్మన్లు, పలువురు కౌన్సిలర్లు నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. మైనార్టీ నాయకులు వివిధ మసీదుల ముతవల్లీలు పాల్గొన్నారు. మైనార్టీ నాయకులు ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆద్వర్యంలో పండ్లు, నీళ్ల పాకెట్లు పంపిణీ చేశారు. ఆగ్రోస్ చైర్మేన్ నవీన్ నిశ్చల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 3వ వార్డు కౌన్సిలర్ లక్ష్మి మహేష్, సి ఎన్ పి నాగరాజు, సలీం ల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. టిడిపి ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కార్యక్రమంలో నాయకులు రమేష్ కుమార్, అనిల్ కుమార్,అంజినప్ప అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు. వినాయక నిమజ్జన శోభాయాత్రలో ఏలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా డీఎస్పీ కంజాక్షన్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ బెయిల్ రద్దయితే వైసిపి ఖాళీ

టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి

ప్రజాశక్తి-సోమందేపల్లి

వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రస్తుతం బెయిల్ మీద పరిపాలన సాగిస్తున్నారని, పొరపా టున కోర్టు బెయిల్ రద్దు చేస్తే 15 నిమిషాల వ్యవధిలో ఆ పార్టీ ఖాళీ అవుతుందని టిడిపి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథి ఎద్దేవా చేశారు. టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక ఎన్‌టిఆర్ సర్కిల్‌లో చేపట్టిన సామూహిక నిరాహార దీక్షలు 12వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఆదివారం బికె పాల్గొని మాట్లాడారు. అబద్ధాలతో అభివృద్ధి చెందిన మాటల్లో ... స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు సంబంధించి చంద్రబాబు మీద సిఐడి పెట్టిన కేసు అక్రమమని, ఆరోపణలు నిరాధారమన్నారు. జగన్ రెడ్డి పగ తప్ప ఈ కేసులో చంద్రబాబు తప్పిదమేమీ లేదని, తొందర్లోనే కడిగిన ఆణిముత్యంలా, మచ్చలేని చంద్రుడిగా బయటికి వస్తారన్నారు. అక్రమ కేసులు ఎన్ని పెట్టినా చంద్రబాబు అదరడు.. బెదరడు.. భయపడడు. త్వరలోనే మీ ప్రభుత్వాన్ని, మీ పార్టీని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేస్తారన్నారు. భవిష్యత్తు ఎన్నికల్లో టిడిపి అత్యధిక స్థానాలు గెలవబోతోందని జోస్యం చెప్పారు. చంద్రబాబు బయటకు వచ్చే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతా యని స్పష్టం చేశారు. అనంతరం నిరాహార దీక్షలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. వీరికి జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సిద్ద లింగప్ప, టౌన్ కన్వీనర్ వడ్డే సురేష్, భానుకీర్తి, హరికృష్ణ, కిష్ట, అశ్వర్థనారాయణ, నాగమణి, సుబ్బరత్నమ్మ, అనసూయమ్మ, గోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు విడుదలయ్యే వరకూ పోరాటం ఆగదు : పల్లె

పుట్టపర్తి క్రైమ్ : చంద్రబాబును విడుదల అయ్యేవరకూ పోరాటం ఆపే ప్రసక్తే లేదని మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం ముందు చేపట్టిన సామూహిక రిలే నిరాహార దీక్షలు 12వ రోజూ కొనసాగాయి. పల్లె మాట్లాడుతూ అక్రమ కేసులకు భయపడేది లేదన్నారు. జగన్ ప్రభుత్వం తమ తప్పులు తెలుసుకొని బాబును విడుదల చేయాలని లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. దీక్షలో నాయకులు శ్రీరామ్‌రెడ్డి, సామకోటి ఆదినారాయణ, పుల్లప్ప, మహమ్మద్‌రఫీ, సాలక్కగారి శ్రీనివాసులు, పైపల్లి సర్పంచి ప్రవీణ్, మురారి, రాష్ట్ర బిసి సెల్ నాయకుడు బొమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన సామూహిక రిలే నిరాహారదీక్షల్లో టిడిపి మహిళా నాయకు రాళ్లు పాల్గొని సిఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీక్షల్లో పర్వీన్‌బాను, కౌన్సిలర్ సేగు సుధారాణి, నాయమ్ సావిత్రమ్మ, పీటల రమణమ్మ పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించి జైలుకు పంపి సిఎం జగన్ శునకానందం పొందు తున్నారని నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి తెలిపారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యం లో రొళ్ల మండల పరిధిలోని జీరిగేపల్లిలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గుండుమల మాట్లాడుతూ దుర్మార్గ పాలనను అంతమొందించడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబును విడుదల చేసేంత వరకూ దశల వారీగా శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. చంద్రబాబు త్వరలోనే బయటికి రావడం జరుగుతుందని కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దు అని ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి ధైర్యం చెప్పారు.



సోమందేపల్లి దీక్షలో మాట్లాడుతున్న బికె పార్థసారథి

ప్రతిరోజు ఒక మండలంలో శాంతియుతంగా కార్యక్రమాలు చేపడ్డం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు పార్థసారథిరెడ్డి, ఇంజనీర్ మల్లికార్జున, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కష్టమూర్తి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, కన్వీనర్ దాసిరెడ్డి, ఐటిడిపి తాలూకా అధ్యక్షుడు కాంతరాజు, తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, కొత్తపాలెం శీనప్ప, జిఎస్ యోగానంద్, రాజకుమార్, నాగరాజు, రమేష్, ఈరన్న, దొడ్డ లింగప్ప, శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే గుండుమల ఆధ్వర్యంలో "సైకో పాలన పోవాలి-సైకిల్ పాలన రావాలి' నినాదంతో పాదయాత్ర చేపట్టారు. రొళ్ల మండల పరిధిలోని అగ్రహారం నుంచి ప్రారంభమైన పాదయాత్ర బిజి హళ్లి, మల్లినమడుగు, కల్లేపల్లి, జీరిగేపల్లి వరకూ సాగింది. పాదయాత్రకు అనూహ్య స్పందన లభించింది.

గుడిబండ : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా స్థానిక హనుమాన్ థియేటర్ ఆవరణలో ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే ఈరన్న ఆధ్వర్యంలో తెలుగు తమ్ముళ్లతో కలిసి నిరాహార దీక్ష చేపట్టారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ అన్ని అనుబంధ విభాగాల నాయకులు, పాల్గొని విజయవంతం చేయాలని ఈరన్న కోరారు.





మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న గుండుమల, టిడిపి శ్రేణులు, పుట్టపర్తిలో రిలే దీక్షలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

'చలో విజయవాడ'కు తరలిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని డిమాం డ్ చేస్తూ సోమవారం విజయవాడలో తలపెట్టిన మహాధర్నాకు ఆదివారం హిందూపురం ప్రాజెక్ట్ నుంచి సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ వర్కర్స్ పెద్దఎత్తున తరలివెళ్లారు. పోలీసులు ఎక్కడికక్కడ అంగన్వాడీ కార్యకర్తల కు ముందస్తు నోటీసులు ఇచ్చి అడ్డుకున్నప్పటికీ, వాటని అధిగమించి అంగన్వాడీ సిబ్బంది మహాధర్నాల పాల్గొనడానికి తరలివెళ్లారు. సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా గుర్తింపు, కనీస వేతనం రూ. 26వేలు, ఈఎస్ఐ, పిఎఫ్, గ్రాట్యుటీ, ప్రతి నెలా 10వ తేదీ లోపు వేతనాల చెల్లింపు, 2017 నుంచి పెండింగ్ ఉన్న టిఎ, డిఎ బిల్లులు, నాణ్యమైన కోడిగుడ్లు, పాలు ప్రభుత్వమే అందించాలన్నారు. ఆయా డిమాండ్ల సాధన కోసం అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న మహాధర్నాకు సిఐటియు తరపున సంపూర్ణ మద్దతు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, అంగన్వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.

సిఐటియు, అంగన్వాడీ నాయకురాళ్ల ముందస్తు అరెస్ట్

లేపాక్షి : 'చలో' విజయవాడ కార్యక్రమానికి వెళ్తారనే ఉద్దేశంతో ఆదివారం పోలీసులు సిఐటియు, అంగన్వాడీ నాయకురాలు ధనమ్మను ముందస్తు అరెస్ట్ చేశారు. ఆమె మాట్లాడు తూ మమ్మల్ని అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమం ఆగదన్నారు. ఉద్యమం మరింత ఎక్కువగా చేస్తామన్నారు. ముందస్తు అక్రమ అరెస్టులు చేయడం మంచిది కాదు అని ధ్వజమెత్తారు.



పురం నుంచి విజయవాడకు వెళ్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

ప్రజాశక్తి-మడకశిర

క్రీడల్లో క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహులు సూచించారు. పట్టణంలోని జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన నరసింహులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఆటల పోటీలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరచాలని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని ఇద్దరిలో ఎవరో ఒకరు మాత్రమే గెలుస్తారని ఓడినవారు కుంగిపోకుండా మరొకసారి గెలవడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పబ్లిసిటీ జిల్లా అధ్యక్షుడు చీపులేటి వెంకట రంగారెడ్డి, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి బేకరీ నాగరాజు, నాయకులు క్రీడాకారులు పాల్గొన్నారు.

సుడిగాలి పర్యటన

వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎం.నరసింహులు ఆదివారం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో పర్యటించి అధికారుల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇంటి పట్టాల విషయంలో ప్రజల ఇబ్బందులను గుర్తించి అధికారులతో చర్చించి పరిష్కారానికి చొరవ చూపుతున్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీల్లో పాల్గొని తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. అలాగే గుడిబండ జడ్పిటిసి భూతరాజుని కలిసి మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఈయన వెంట పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతరెడ్డి, తదితరులు ఉన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న వైసిపి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నర్సింహులు

కనకదాసు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

ఆధునిక కవి, తత్వవేత్త, సంగీతకారుడు, స్వరకర్త, గొప్ప కృష్ణ భక్తుడు, కురుబల ఆరాధ్య దైవమైన భక్త కనకదాసు విగ్రహ ఏర్పాటుకు ఆదివారం స్థానిక గోరంట్ల-హిందూపురం ప్రధాన రహదారి పక్కన మండల కురుబ సంఘం గౌరవాధ్యక్షులు వెంకటేష్, అధ్యక్షులు, దంత వైద్యులు గిరిప్రసాద్, ఉపాధ్యక్షులు సత్యనారాయణ నేతృత్వంలో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ పట్టణంలో కనకదాసు విగ్రహం ఏర్పాటుకు సహకరించిన జిల్లా వైసిపి అధ్యక్షులు, ఎమ్మెల్యే శంకరనారాయణ, స్థానిక వైసిపి నాయకులకు కృత జ్ఞతలు తెలిపారు. అలాగే కనకదాసు గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచి సరోజ నాగేనాయక్, జడ్పిటిసి పాలేజయరాం నాయక్, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకర్‌రెడ్డి, అగ్రి అడ్వైజర్ కమిటీ ఛైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.



కనకదాసు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న దృశ్యం

టిడిపిలో పలువురు చేరిక

మడకశిర : రొళ్ల మండలం బొమ్మనహళ్లి పంచాయతీ పరిధిలోని అగ్రహారం, జిజి హట్టి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ఆదివారం నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి, పార్టీ పరిశీలకులు పార్థసారథిరెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారిలో జిజి హట్టి గ్రామానికి చెందిన పీపన్న, అగ్రహారం గ్రామానికి చెందిన నరసింహప్ప కుమారుడు తిప్పేస్వామి అనుచరులతో కలిసి టిడిపిలో చేరగా వారికి గుండుమల పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. వైసిపి పాలనలో విసిగి వేసారి ఆ పార్టీని వదిలి టిడిపిలో చేరుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ దాసిరెడ్డి, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి జికె ఈరన్న, రొళ్ల కొండ రామకృష్ణ, తెలుగు యువత అధ్యక్షుడు బాలకృష్ణ, కొత్త పాల్యం శీనప్ప, బ్యాడికి రామ్మూర్తి పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారికి పార్టీ కండువా వేస్తున్న గుండుమల

ఎపియుఎస్ జిల్లా అధ్యక్షులుగా అమరచంద్రబాబు

కొత్తచెరువు : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఎపియుఎస్) ఆధ్వర్యంలో ఆదివారం అనంతపురంలోని సరస్వతీ విద్యా మందిరంలో శ్రీసత్యసాయి జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణార్జునరెడ్డి (నంద్యాల) హాజరయ్యారు. వీరి పర్యవేక్షణలో జిల్లాకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా అమర చంద్రబాబు(జడ్పీహెచ్ఎస్ మావటూరు, ప్రధాన కార్యదర్శిగా కె.సురేష్‌బాబు (ఎంపిపి స్కూల్, దూపంపల్లి) లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు వీరి ఎన్నిక పట్ల పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.



ప్రమాణం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

జగన్ హామీల్లో 98.55 శాతం అమలు:ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాండ్లపెంట

గత ఎన్నికల సమయం లో పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో సిఎం జగన్ 98.55 శాతం హామీలు అమలు చేశారని ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లమీదపల్లిలో ఆదివా రం ఎమ్మెల్యే నూతన సచివాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. దాదాపు రూ. 40 లక్షలతో సచివాలయాన్ని పూర్తి చేశామని, ఇకపై నూతన భవనంలోనే పరిపాలన సాగుతుందని తెలిపారు. గ్రామ సచివాలయం, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో సిఎం జగన్ ప్రజలకు మరింత మంచి పనులు చేస్తాడన్నారు. మాజీ సిఎం చంద్రబాబు స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్‌లో అవినీతికి పాల్పడి జైలు పాలయ్యాడని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ రామ్ నాయక్, పంచాయతీ కార్యదర్శి శంకర్‌నాయుడు, ఎంపిపి టి.జగన్మోహన్, మండల కన్వీనర్ జి.రవీందర్‌రెడ్డి, పోరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సర్పంచులు కళావతి, రవీంద్రనాయక్, శాంతమ్మ, చలపతి, ఆర్‌బికె ఛైర్మన్ శంకరనాయుడు, ప్రతాప్‌రెడ్డి, బి.రాజారెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బి.శ్రీనివాసులునాయక్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

మల్లంపల్లిలో లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

మండల పరిధిలోని పోతుల కుంట పంచాయతీ మల్లంపల్లి గ్రామంలో గ్రామస్తులు, దాతల సహకారంతో నూత నంగా నిర్మించిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొని రూ. 20వేలు విరాళం అందజేశా రు. ముందుగా ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయిం చారు. పల్లె మాట్లాడుతూ గ్రామస్తులందరూ కలిసి ఆలయం నిర్మించినందుకు అభినందనలు తెలిపారు. ఇలాగే ఐకమత్యంతో గ్రామంలో అభివృద్ధి పనులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కొత్తచెరువు మండల కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, సాలక్కగారి శ్రీనివాసులు, బొమ్మయ్య, టిడిపి నాయకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపిపి గాయత్రి రెడ్డప్పరెడ్డి కూడా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



విరాళం అందజేస్తున్న పల్లె రఘునాథ్ రెడ్డి

కళాశాలల్లో ఎన్ఎస్ఎస్ వేడుకలు

ప్రజాశక్తి -హిందూపురం

జాతీయ సేవా పథ కం(ఎన్ఎస్ఎస్) ఆవిర్భావ వేడుక లను ఆదివారం పట్టణంలోని పలు కళాశాలల్లో ఘనంగా నిర్వ హించారు. సప్తగిరి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎస్.మంజునాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎఐ గంగిరెడ్డి మాట్లాడుతూ సామాజిక చైతన్యం, నాయకత్వం పెంపొందాలంటే ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒలు నాగేందర్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, అధ్యాపకులు మంజునాథ్, అయాజ్, విద్యార్థులు పాల్గొన్నారు. ఎస్‌డిజిఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల అధ్యక్ష కార్యదర్శులు చంద్రమోహన్, బైసాని రాంప్రసాద్ పాల్గొని ఎన్ఎస్ఎస్ డే గురించి వివరించారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జివిఎస్ ప్రసాద్, ఎంబిఎ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ పిఒలు రాజన్న, ఎన్‌సిసి అధికారి ఫణీంద్ర, ఫిజికల్ డైరెక్టర్ హేమంత్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ వేడుకల్లో భాగంగా మొక్క నాటుతున్న దృశ్యం



ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి బొకే అందజేస్తున్న వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి

ఎమ్మెల్యేని కలిసిన వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షులు

కదిరి అర్బన్ : పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం వైసిపి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉబ్బర ప్రసాద్‌రెడ్డి ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా నియమించినందుకు సిఎం జగన్‌కు, ఎమ్మెల్యే సిద్ధారెడ్డికి, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి లీగల్ జోనల్ అధ్యక్షులు లింగాల లోకేశ్వర్‌రెడ్డికి సన్మానం

కదిరి అర్బన్ : పట్టణంలోని నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో ఆదివారం లీగల్ సెల్ జోనల్ ఇన్‌ఛార్జిగా నియామక మైన లింగాల లోకేశ్వర్‌రెడ్డిని కెఎస్ బహావుద్దీన్ ఆధర్వంలో నాయకులు శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందించారు. వారు మాట్లాడుతూ లోకేశ్వర్‌రెడ్డి ఇంకా ఎన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిఎం షఫీ, మెరువ నాగమల్లు, బైకు భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ మహబూబ్ బాషా, హైదర్ వలి, న్యామత్ అలీ, బాబా, మోహన్‌రెడ్డి, అలంకార్ జాకీర్, ఆర్ఎంఎస్ గౌస్ బాషా, మెహబూబ్ ఖాన్, మస్తాన్‌ఖాన్, బాబులాల్, ముబారక్, ఇమాం కాశీం, బత్తల ముబారక్ పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

కదిరి అర్బన్ : నల్లచెరువు మండల పరిది. లోని నీలోల్లపల్లిలో గొర్రెల మందపై దుండగులు దాడి చేసి గొర్రెల కాపరి పక్కీరప్పను గాయపరిచి 40 గొర్రెలు ఎత్తుకెళ్లారు. దీంతో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పక్కీరప్పను పరామర్శించారు. అధైర్యపడ వద్దు అండగా ఉంటామని వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

నేరాలు ఘోరాలు

తండ్రిని చంపిన కొడుకు

ముదిగుబ్బ : కన్నతండ్రిని తనయుడు కడతేర్చిన సంఘటన మండల పరిధిలోని అడవి బ్రాహ్మణపల్లి తండాలో చోటుచేసుకుంది. సిఐ యతీంద్ర తెలిపిన వివరాలు.. తండాకు చెందిన భుక్యా భీమ్లానాయక్ కొడుకు భుక్యా విజయకుమార్ నాయక్. భీమ్లా నాయక్ భార్యపై అనుమానంతో నిత్యం కుటుంబ సభ్యులతో గొడవ పడేవాడు. ఈక్రమంలో శనివారం రాత్రి మరోమారు తండ్రి కొడుకులు గొడవ పడ్డారు. ఈ గొడవ తార స్థాయికి చేరడం, నిత్యం గొడవలతో ఊర్లో పరువు పోతుందని కారణంతో విజయకుమార్ క్షణికావేశంలో తండ్రిపై కొడవలితో నరికాడు. దీంతో భీమ్లానాయక్ అక్కడికక్కడే కుప్పకూలి మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే పోలీసుల సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుని కుమార్తె లతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



హత్యకు గురైన భీమ్లానాయక్

కల్వర్టును ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

ముదిగుబ్బ : మండల పరిధిలోని ఎన్‌సిపి కొట్టాల సమీపంలో ఓ కారు కల్వర్టును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పట్నం ఎస్‌ఐ ఇషాక్ తెలిపిన వివరాలు.. శశికుమార్, మహేష్, కార్తికేయ ముగ్గురు రూ కలిసి కారులో బత్తలపల్లి నుంచి మదనపల్లికి వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్‌సిపి కొట్టాల సమీపం లో అదుపుతప్పి కల్వర్టును ఢీకొన్నారు. ఈ సంఘట నలో శశికుమార్ అక్కడికక్కడే మృతి చెందగా మహేష్, కార్తికేయ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పట్నం ఎస్సై ఇషాక్, పోలీసులు సంఘట నా స్థలానికి చేరుకొని ఇద్దరు క్షతగాత్రులను 108 ద్వారా కదిరికి తరలించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాదంలో మృతి చెందిన శశికుమార్

చేనేత కార్మికుడి ఆత్మహత్య

ధర్మవరం టౌన్ : పట్టణంలోని మాధవనగర్‌కు చెందిన గంగాధర్(55) అనారోగ్య కారణాలతో ధర్మవరం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. గంగాధర్ చేనేత కూలి మగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కొంతకాలంగా ఆరోగ్యం సరిగా లేక మగ్గం నేయలేక తరచూ మనోవేదనకు గురయ్యేవాడు. దీంతో కుటుంబ పోషణ భారమై శనివారం సాయంత్రం ధర్మవరం మొదటి మరువ వద్ద చెరువులో దూకాడు. ఆదివారం ఉదయం చెరువులో శవాన్ని గమనించిన స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవాన్ని బయటకు తీయించి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య జయలక్ష్మి, ముగ్గురు కుమార్తెలున్నారు.

గణేశ్ నిమజ్జనం ఘర్షణలో 18 మందిపై కేసు

సోమందేపల్లి : మండల పరిధిలోని చాకరపల్లి గ్రామంలో రెండు రోజుల క్రితం జరిగిన వినాయక నిమజ్జనంలో కుల వివక్ష నేపథ్యంలో చోటుచేసుకున్న ఘర్షణలో 18 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. చాకర్లపల్లిలో వినాయక నిమజ్జనం ఊరేగింపులో భాగంగా కొందరు వ్యక్తులు కుల వివక్షకు పాల్పడుతూ మా విగ్రహం కంటే ముందు వెళ్లరాదని అడ్డుపడ్డారు. దీనికి తోడు మరో వర్గం వారు వెంబడే వెళ్లారన్న కక్షతో కొందరు వ్యక్తులు రాత్రి సమయంలో కొందరి ఇళ్లకు వెళ్లి కులంతో దూషిస్తూ కొట్టారని మాల సుజాతమ్మ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. దంతో పెనుకొండ డీఎస్పి ఆధ్వర్యంలో విచారణ చేసిన పోలీసులు 18 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యకేసులో ఎనిమిది మంది అరెస్టు

ముదిగుబ్బ : వినాయక చవితి వేడుకల్లో భాగంగా దొరిగల్లు క్వార్టర్స్‌లో ఇరువర్గాల ఘర్షణలో కట్టెలు, రాళ్ల దాడిలో అనంతయ్య(55) హత్య కేసులో ఆదివారం 8 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు సిఐ యతీంద్ర తెలిపారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

రొద్దం : మండల పరిధిలోని ఆర్.మరువపల్లిలో ఆదివారం విద్యుత్ షాక్‌కు గురై ఓ ఆవు మృతి చెందగా రైతు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వివరా లు.. గ్రామానికి చెందిన రైతు బోయ రామాంజనప్ప కొన్ని రోజుల క్రితం రూ. 1.30 లక్షలు వెచ్చించి 2 ఆవులు కొనుగోలు చేశాడు. రోజూ లాగే ఆదివారం గ్రామ సమీపంలోని చెరువు కట్ట కింద ఉన్న పొలాల్లో మేపడానికి ఆవులను తీసుకెళ్లాడు. ఆ ప్రదేశంలో ఓ రైతు తన బోరుకు ఏర్పాటు చేసిన విద్యుత్ తీగలు పూర్తిగా కాలిపోయి నేలపై పడి ఉన్నాయి. రైతుతో పాటు ఆవు ఆ వైరుకు తగల డంతో షాక్‌కు గురయ్యారు. గమనించిన సమీపంలోని ఇద్దరు రైతులు రామాం జనప్ప కాలికి పంచె కట్టి బయటకు ఈడ్చారు. అతడిని కుటుంబ సభ్యులు హుటా హుటిన అంబులెన్సులో పెనుకొండకు తరలించి, ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. ఆవు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందడంతో రూ. 60వేలు నష్టం వాటిల్లింది. ఇదిలా ఉండగా ఆ విద్యుత్ తీగలను దాదాపు మూడేళ్ల నుంచి నిర్లక్ష్యంగా నేలపై ముళ్ల చెట్లలో వదిలేసినట్లు తెలుస్తోంది.

చలో విజయవాడకు వెళ్లకుండా ముందస్తు నోటీసులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

అంగన్వాడీ సమస్యల పరిష్కారం కోసం సోమవారం తలపెట్టిన చలో విజయవాడకు వెళ్లకుండా సిఐటియు, రైతు సంఘం నాయకులకు వన్‌టౌన్ సిఐ సుబ్రమణ్యం ఆదివారం ముందస్తు నోటీసులను స్టేషన్లోనే అందజేశారు. సిఐటియు నాయకులు అయూబ్‌ఖాన్, ఎల్.ఆదినారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు జెవి రమణ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో చలో విజయవాడ కార్యక్రమం తలపెట్టగా పోలీసులు వెళ్లకుండా ముందస్తుగా నోటీసులు ఇచ్చి ఉద్యమాలను ఆపలేరన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం అవుతుం దన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వారు హితవు పలికారు. అంగన్వాడీ సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేపడుతామన్నారు.

నీటికుంటలా పాఠశాల ప్రాంగణం

చిలమత్తూరు : మండల పరిధిలోని నల్లరాళ్లపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల నీటికుంటగా మారింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చిన్నపాటి వర్షం కురిసినా పాఠశాల ఆవరణంలో నీరు చేరి చిన్నపాటి చెరువును తలపిస్తుంది. ఇక నీరు ఇంకే లోపు మొత్తం బురదగా మారి అధ్వాన్నంగా మారుతుంది. దీనికి తోడు పాఠశాల భవనం కాలం చెల్లడంతో పెచ్చులూడింది. దీంతో పాఠశాలకు తమ పిల్లలను పంపాలంటే భయమేస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో దాదాపు 30 మంది విద్యార్థులుండగా ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల నాడు నేడు పథకానికి ఎంపిక కాక పోవడంతో అభివృద్ధికి నోచుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. పాఠశాల భవనం నిర్మాణానికి "ఆర్డీటీ" ముందుకు వచ్చిందన్నారు. అయితే కాలం చెల్లిన భవనాన్ని కూల్చేందుకు సంబందిత అధికారులు ఆమోదం తెలపకపోవటంతో సమస్య నెలకొందని చెబుతున్నారు. కాలం చెల్లిన భవనం కూల్చడానికి ప్రభుత్వం డబ్బులు ఇవ్వక పోయినా తాము చందాలు వేసుకుని భవనాన్ని తొలగిస్తామని అన్నారు. అధికారులు అనుమతి ఇచ్చి తమ పిల్లల భవిష్యత్తు కు తోడ్పడాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో చేరిన నీటిని చూపుతున్న గ్రామస్తులు